అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -341 ఆదివారం 19 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




5

భూముల విలువ పెంచే ప్రతిపాదన

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి








## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

**డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు**

**అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం**

**తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్**

**చెన్నై,ఏప్రిల్18:**మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. **2లో...**

## విపక్షాలు జీవితాంతం చింతిస్తాయి

**విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయం మోదీ**

**మహిళలకు విపక్షాలు వ్యతిరేకం**


**బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి**

**ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి**

**కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన**

**కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు**

**13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం**మిగతా 2లో...**

## మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం..!




**మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్**

**ఇప్పటికే 30 ఏళ్లుగా మోసం చేస్తోంది**

**మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం**

**నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన**

**ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం**

**నిడదవోలు,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** మహిళలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇప్పటికే 30 ఏళ్లు కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవుతాయో**మిగతా 2లో...**

## హర్మూజ్‌పై మళ్లీ పీటముడి

### మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన

**టెహ్రాన్,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగుతుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు **మిగతా 2లో...**



## జర్నలిస్టులు ఉగ్రవాదులా?

**టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధిస్తోందని జగన్ ఆరోపణ**

**జర్నలిస్టులు పూడి శ్రీహరి, కేవీఆర్‌పై కేసులను ప్రస్తావించిన జగన్**

**అమరావతిఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని, ప్రత్యేకంగా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దేశద్రోహమా అని నిలదీశారు. **2లో...**



## 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

### కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్‌ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును

## రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యింది

**తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య**

**పెదవి విప్పని తెలంగాణ బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు**

**ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు**

**రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు**

**జగిత్యాలలో కెసిఆర్ ఆశీర్వాద సభ పరిశీలన**



**జగిత్యాల,ఏప్రిల్18(ఆర్ఎన్ఎ):** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ

## దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

**2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**

**మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి**

**డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు**మిగతా 2లో...**





## రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

**20న కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్**



## పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

**అధికారులతో సమావేశంలో అస్వస్థతకు గురైన పవన్**

**వారం నుంచి పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచన**

**పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందని వెల్లడి**

**పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ ప్రకటన**

**అమరావతిఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం ఉదయం అధికారులతో సమావేశంలో **మిగతా 2లో...**

# మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం

**మొదటిపేజీ తరువాయి**



ఆ దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంతో మహిళా రిజర్వేషన్ల అమలు 2034కి వెళ్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకించినందుకు నిరసనగా శనివారం నిడదవోలులో ఎన్డీఏ కూటమి పక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నిమ్మల రామ్మోహన్ నాయుడు, క ందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని అన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయీ హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనకు బాధ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, సమాన ఆస్తి హక్కును దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కల్పించారని ఉద్ఘాటించారు. ఏపీ డ్వాక్రా మహిళలు దేశ వ్యాప్తంగా నెంబర్ వన్‌గా పనిచేస్తున్నారని ప్రశంసించారు. వరకట్న సమస్య పోయిందని చెప్పుకొచ్చారు. ఆడబిడ్డలే భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్నారంటే, అది ఆడబిడ్డల శక్తి అని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అనుకుని ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యేదని.. కానీ ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఈ నాటిది కాదని చెప్పుకొచ్చారు. మహిళలకు ఎప్పుడు న్యాయం చేయని పార్టీ, ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. మహిళలకు రిజర్వేషన్లు వచ్చేవరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

# దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

**మొదటిపేజీ తరువాయి .**

మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓ టమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకోవాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యింది

**మొదటిపేజీ తరువాయి**



ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ – పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాను పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్‌లో చిన్న అనుకున్న. కానీ రేవంత్‌ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

**హైదరాబాద్,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ది చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది.

# విపక్షాలు జీవితాంతం చింతిస్తాయి

**మొదటిపేజీ తరువాయి**

చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298–230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు.

# పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

**మొదటిపేజీ తరువాయి**

ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు.
వ్యక్తిగత వైద్యుల సూచన మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను కూడా పవన్ కల్యాణ్ రద్దు చేసుకున్నారు. ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలతో పాటు ఎంఆర్ఐ కూడా నిర్వహించారు. రిపోర్టులను సమీక్షించిన వైద్యులు, శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించి విజయవంతంగా పూర్తి చేశారు. వారం నుంచి పది రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత పవన్ కల్యాణ్ తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన పూర్తిస్థాయిలో కోలుకోవడానికి గణనీయమైన సమయం పడుతుందని, దీర్ఘకాలికంగా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వివరాలను జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.కాగా, పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించినట్టు తెలుస్తోంది.

# హర్మూజ్‌పై మళ్లీ పీటముడి

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్ట్‌లన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా–ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్భందనం ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్భంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

# జర్నలిస్టులు ఉగ్రవాదులా?

**మొదటిపేజీ తరువాయి**

ఇది జంగిల్ రాజ్ కాదా అని ఆయన ప్రశ్నించారు.సీనియర్ జర్నలిస్టులైన పూడి శ్రీహరి, కేవీఆర్‌లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు జగన్ తెలిపారు. "బీసీ వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూడి శ్రీహరి చేసిన తప్పేంటి? అతనిపై అక్రమ కేసులు పెట్టి, ఇంట్లో సోదాలు చేయడానికి అతనేమైనా ఉగ్రవాదా? టెర్రరిస్టా?" అని జగన్ ప్రశ్నించారు. అదేవిధంగా, తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ ఇంట్లో లేని సమయంలో ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు. పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని నిలదీశారు.గడిచిన రెండేళ్లలో మహిళలు, బాలికలపై జరిగిన ఎన్నో దాడుల ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, తమను ప్రశ్నించిన వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతోందని జగన్ విమర్శించారు. "మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదు. కానీ, వాస్తవాలు మాట్లాడితే మీకు ఎందుకు అంత ఉలుకు?" అని ప్రశ్నించారు.

# 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్



**మొదటిపేజీ తరువాయి** క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, సిహెచ్. ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

---------

# సూరారం అభివృద్ధికి ప్రాధాన్యం

## సర్పంచ్ నీల కొమురయ్య స్పష్టం



**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 18( జర్నలిస్ట్ వార్త):** మండలంలోని సూరారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని సర్పంచ్ భాషబోయిన నీల కొమురయ్య అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం గ్రామ కార్యదర్శి, పాలకవర్గం ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రామంలో మంచినీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ ఏర్పాటు చేసి, కొత్త మోటార్ ద్వారా తాగునీటి సరఫరా చేపట్టినట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల శుభ్రత, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.మాజీ ఎంపీపీ తంగేడ శాలిని, మహేందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, వైస్ ఎంపీపీ నగేష్ తదితర నాయకులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.గ్రామంలో మద్యపానం, గుడుంబా, గంజాయి నియంత్రణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులను మద్యం, డ్రగ్స్ నుండి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి సూరారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ నీల కొమురయ్య తెలిపారు.

# జనగణన శిక్షణకు శ్రీకారం- ధర్మసాగర్‌లో ప్రారంభం





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరోఏప్రిల్ 18: (జర్నలిస్ట్ వార్త)** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణన2027 కార్యక్రమానికి సన్నాహాలు జోరందుకున్నాయి. ఇందులో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్‌పై ఫేజ్1 శిక్షణను అధికారులు నిర్వహించారు.మండల జనగణన అధికారి, తహశీల్దార్ జి.సదానందం, అదనపు ఛార్జ్ ఆఫీసర్, ఎంపీడీఓ కె.అనిల్‌కుమార్, ఎంఈఓ రామ్‌ధన్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి కీలకమని, సమాచార సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గృహాల వివరాల సేకరణలో ప్రజలతో సమన్వయం అత్యవసరమని పేర్కొన్నారు.శిక్షణను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. మొదటి విడత ఏప్రిల్ 18, 20, 21 తేదీల్లో, రెండో విడత 23 నుంచి 25 వరకు, మూడో విడత 27 నుంచి 29 వరకు కొనసాగనుంది. తొలి రోజున గృహ గణన విధానాలు, మొబైల్ యాప్ వినియోగం, ప్రశ్నావళి నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు వివరంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల బారిన గ్రామాలు

## మౌన విపత్తుగా మారిన మద్యం- చూసీ చూడనట్టే అధికారులు

## డి హెచ్ పి ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజారపురత్నం



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు రాజారపు రత్నం ధర్మసాగర్ మండల కేంద్రంలో మాట్లాడుతూ జిల్లాలో బెల్ట్ షాపుల విస్తరణ రోజురోజుకూ పెరిగి గ్రామీణ సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. అధికారికంగా నిషేధం ఉన్నప్పటికీ, 14 మండలాల గ్రామాల్లో ఇవి బహిరంగంగా నడుస్తుండటం గమనార్హం. గ్రామాల్లో అవసరమైన సరుకులు దొరకకపోయినా, మద్యం మాత్రం ఎక్కడైనా సులభంగా లభ్యమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.ప్రత్యేకంగా దళిత కాలనీల్లో పరిస్థితి విషమంగా మారింది. రోజువారీ కూలీ సంపాదనలో ఎక్కువ భాగం మద్యం కోసం ఖర్చవుతుండటంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోంది. పేదరికం మరింత పెరుగుతూ కుటుంబాలు సంక్షోభంలోకి జారుతున్నాయి.మద్యం ప్రభావంతో కుటుంబాల్లో గొడవలు, గృహహింస ఘటనలు పెరుగుతున్నాయి. మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి అధికమవడంతో గ్రామీణ మహిళలు మద్యం వ్యతిరేకంగా పోరాటాలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇదే సమయంలో విద్యా రంగంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. తల్లిదండ్రులు సంపాదనను మద్యం మీద ఖర్చు చేయడంతో పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోతోంది. బాల కార్మికత్వం పెరుగుతుండగా, దళిత పిల్లల్లో డ్రాప్‌అవుట్‌లు అధికమవుతున్నాయి.గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకూ బెల్ట్ షాపులు ముప్పుగా మారాయి. చిన్నపాటి గొడవలు, నేరాలకు ఇవే కేంద్రాలుగా మారుతున్నాయి. యువత మద్యం వైపు ఆకర్షితులవుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారు.ఇంత పెద్ద సమస్య కొనసాగుతున్నప్పటికీ, బెల్ట్ షాపుల నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయ ప్రోత్సాహం, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇవి నిర్భయంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని డి హెచ్ పి ఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు

# స్నేహానికి చిరునామా నరసింహ



**సత్తుపల్లి,/ ఏప్రిల్ 18( జర్నలిస్ట్ వార్త)**సత్తుపల్లి మండలం గంగారం పోలీస్ బెటాలియన్‌లో ఐదేళ్లపాటు సహా కమాండెంట్‌గా సేవలందించిన నరసింహ హైదరాబాద్ బెటాలియన్‌కు బదిలీ అయిన సందర్భంగా విశ్వశాంతి విద్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నరసింహ విధులు నిర్వహించిన ప్రతి చోట పోలీస్ సిబ్బంది, అధికారులతో పాటు ప్రజలతోనూ స్నేహపూర్వకంగా మెలిగి ఆదర్శంగా నిలిచారని అన్నారు. సేవా భావం, క్రమశిక్షణతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నరసింహను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందించారు.

# ధర్మసాగర్‌లో 'సృజోత్సవం' సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):** జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజుల సమ్మర్ క్యాంప్ 'సృజోత్సవం' శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరం ఈ నెల 23వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్నారు.ధర్మసాగర్ గ్రామానికి చెందిన 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు ఇప్పటికే శిబిరంలో పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్, క్యాంప్ కోఆర్డినేటర్ కె.బి.ధర్మప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవాత్మక విద్య అందించడమే 'సృజోత్సవం' లక్ష్యమని తెలిపారు.

శిబిరంలో సైన్స్ ప్రయోగాలు, ఫన్ మ్యాథ్స్, పజిల్స్ పరిష్కారం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ, సమకాలీన అంశాలపై చర్చలు, ఒరిగామి, పేపర్ క్రాఫ్ట్ వంటి కార్యక్రమాలతో పాటు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మిషన్ కాకతీయ నీటి శుద్ధి కేంద్రాల సందర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞానపరమైన ఆలోచన, సామాజిక అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.రిసోర్స్ పర్సన్స్‌గా కవితాదేవి, సురేష్, రాజమ్మ, పద్మజ, కిరణ్మయి, రామకృష్ణ పాల్గొని ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై వివరించారు. ఇంకా నమోదు కొనసాగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

# పాయపూర్‌లో మాజీ ఎమ్మెల్యే జన్మదిన సంబరాలు



**తల్లాడ, /ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ముఖ్యమంత్రి జలగం వెంకట్రావు తనయుడు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు జన్మదినం సందర్భంగా తల్లాడ మండలం పాయపూర్ గ్రామంలో శనివారం అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మడుపల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి హర్షాతిరేకంతో శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అభిమానులు స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టగా, పేదలు, వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు.ఈ కార్యక్రమంలో ఐలూరు చిన్న కృష్ణారెడ్డి, దొబ్బున బోయిన శివ, షేక్ రఫీ, అన్వర్, బబ్లు బాయ్, నరసయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలంటూ నిరుపేద మహిళ వేడుకోలు



**తల్లాడ,/ ఏప్రిల్ 18:( జర్నలిస్ట్ వార్త)** మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన ఓ నిరుపేద మహిళ తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంది. "రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిడ భర్త అనారోగ్యంతో పడిపోవడంతో జీవితం మరింత కష్టాల్లోకి వెళ్లింది" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అద్దంకి కళావతి, నరసింహారావు దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్న ఈ కుటుంబానికి ఇటీవల భర్తకు పక్షవాతం రావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ప్రతి నెల రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు మందులకు ఖర్చవుతుండటంతో కుటుంబం కుదేలైంది.ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేసిన కళావతి, మరో కూతురు ప్రస్తుతం డిగ్రీ చదువుతోందని తెలిపింది. ప్రస్తుతం రేకుల షెడ్డు ఇల్లు మాత్రమే ఉండటంతో వర్షాలు, గాలులకు ఇబ్బందులు పడుతున్నామని, నివాసానికి సరైన ఇల్లు లేక జీవనం దుర్భరంగా మారిందని పేర్కొంది.తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె అధికారులను వేడుకుంది.

# తల్లాడలో చెక్కుల పంపిణీ

## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్‌తో లబ్ధిదారులకు ఊరట





**తల్లాడ/, ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఎండిఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.మండలానికి చెందిన 81 మంది అనారోగ్య బాధితులకు రూ.20,51,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా 48 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ.48,05,568 విలువైన చెక్కులు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అలాగే తక్కువ సమయంలోనే అధిక సంఖ్యలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.నూతనకల్లు గ్రామానికి చెందిన మిరియాల స్రవంతి, ఎక్కిరాల హరిత, నల్గొండ శ్రావణిలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేయడం విశేషం

# వార్డు సభ్యుల శిక్షణ తరగతులు ముగింపు





**తల్లాడ, ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన మూడో విడత వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్ధవంతమైన అమలులో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

పంచాయతీరాజ్ చట్టం, సభ్యుల విధులుబాధ్యతలు, గ్రామసభల నిర్వహణ, నిధుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ రాజు అధ్యక్షత వహించారు. కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజ చౌదరి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, మండల పంచాయతీ అధికారి సురేష్ బాబు పాల్గొన్నారు.

శిక్షణలో భాగంగా మాస్టర్ ట్రైనర్ పరశు రాములు పంచాయతీ పాలన, 73వ రాజ్యాంగ సవరణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది హాజరయ్యారు.



## మిషన్ భగీరథ పైపు లైన్ లికేజి పనులు పర్యవేక్షించిన సర్పంచ్.





**బయ్యారం/,ఏప్రిల్ 18.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల కేంద్రంలో రామాలయం ఎదురుగా మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీతో గత రెండు రోజులుగా నీరు వృధా అవుతుంది. మిషన్ భగీరథ పైప్ లైన్ లీక్ కావడం అధికారుల నిర్లక్ష్యం వల్లే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.భగీరథ పైప్ లైన్ లికేజి పై స్పందించిన బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ పైప్ లైన్ నుంచి నీరు లీకేజీ కాకుండా మరమ్మతులు పనులను చేపడుతున్నట్లు తెలిపారు.తొందరలోనే లికేజి పనులు పూర్తి చేపిస్తామని సర్పంచ్ శాంతి తెలిపారు.

## బయ్యారం అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంతం.



**బయ్యారం/,ఏప్రిల్ 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని హనుమంతుని గడ్డ అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు సీమంతం కన్నుల పండుగగా నిర్వహించారు. గర్భిణిలకు పసుపు, కుంకుమ, స్వీట్లు,పూలు, పండ్లు,చీర, గాజులతో సాంప్రదాయబద్ధంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు గుగులోత్ శాంతి కిషన్ నాయక్,జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ లు ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడుతూ గర్భవతులకు సీమంతం ద్వారా పుట్టింటి వద్ద అందాల్సిన అపూర్వ గౌరవం అంగన్వాడి కేంద్రంలో అందాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.ఈ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా వున్న కారణంగా గర్భిణీలు ఎక్కువ నీరు త్రాగాలని,ప్రతి నెల క్రమం తప్పకుండ డాక్టర్ చెకప్ చేపించు కోవాలని వారు గర్భిణీలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా,అంగన్వాడీ టీచర్లు,విజయలలిత, లలిత,మంగమ్మ, కమలమ్మ,పద్మా,స్వప్న,పద్మా,ఆశా వర్కర్ ముకుంద తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంతో కారు ఢీకొని వ్యక్తి మృతి





**గీసుగొండ/ఏప్రిల్ 18(జర్నలిస్ట్ వార్త):** అతివేగంగా దూసుకొచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. గీసుగొండ పోలీసుల కథనం ప్రకారం.దుగ్గొండి మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన రెడ్డి రమేష్ (46) కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. శనివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై హనుమాన్ మాల ధరించేందుకు కొనైమాకులలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మచ్చాపూర్ సమీపానికి చేరుకోగానే, వరంగల్ వైపు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న కారు అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి రమేష్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఉదయం 10 గంటలకు మరణించాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు గూడూరుకు చెందిన కారు చాలకుడు బానోతు సోముపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు భద్రతా ప్రచార కార్యక్రమంలో భాగంగా గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ఆరో రోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మామ్నూరు సహాయ పోలీస్ కమిషనర్‌తో కలిసి వాహనదారులకు భద్రతా స్టిక్కర్లను పంపిణీ చేశారు. కోనాయిమకుల గ్రామ పంచాయతీ కార్మికులకు హెల్మెట్లు అందజేశారు. ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

# సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లిన ఉద్యమకారుల అరెస్టు అడ్డుకోవడం సిగ్గుచేటు: టీయూఎఫ్



**ఖమ్మం/, ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను సెక్రటేరియట్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సిగ్గుచేటు చర్య అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (రిజి.) రాష్ట్ర కార్యదర్శి డా. కె.వి. కృష్ణారావు మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన సచివాలయ ముట్టడికి ఖమ్మం నుంచి ఉద్యమకారులు బయలుదేరినట్లు తెలిపారు.
ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య ఆధ్వర్యంలో వెళ్లిన వారిని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి, వివిధ స్టేషన్లకు తరలించడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని హైకోర్టు విధించిన రెండు నెలల గడువు ఈ నెల 23తో ముగియనున్నప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందించేందుకు వెళ్లిన వారిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.
కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించి ఐడెంటిటీ కార్డులు జారీ చేయడం, ప్రతి నెల రూ.25 వేల పెన్షన్ అందించడం, 250 గజాల నివాస స్థలం కేటాయించడం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చట్టబద్ధ కమిటీని ఏర్పాటు చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉద్యమకారుల కోసం ప్రత్యేక భవన్ నిర్మాణానికి రెండు ఎకరాల భూమి, రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బచ్చల పద్మాచారి, పగడాల నరేందర్, లింగానబోయిన సతీష్, బత్తిన మధుగౌడ్, నెలవెల్లి వెంకటేశ్వరావు, భుక్య శ్రీనివాస్ నాయక్, కొండ్రు రజనీకాంత్, అజ్మీరా వీరన్న, బానోతు రాంబాబు, గొట్టిపర్తి శ్రీనివాస్, మోత్కురి వెంకటాచారి, అశోక్ సింగ్, గాజుల రవి, ఎస్.కే. యాకూబ్, గాలి రాము, ఇనుప శీను, కొట్టే ఉపేందర్, ఇనుప సుందర్రావు, పసుపులేటి శ్రీనివాస్, రాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు వీగిపోవడం మోదీ ప్రభుత్వ వైఫల్యమే..

### వర్ధన్నపేటలో కాంగ్రెస్ నాయకుల ధ్వజం: ప్రధాని రాజీనామాకు డిమాండ్



**వర్ధన్నపేట/ఏప్రిల్ 18(జర్నలిస్ట్ వార్త);**
131వ రాజ్యాంగ సవరణ బిల్లులోని మహిళా రిజర్వేషన్లు, డిలిమిటేషన్ అంశాలపై కేంద్రంలోని బీజేపీ అనుసరించిన తీరును నిరసిస్తూ వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యం, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల చాటున డిలిమిటేషన్ ప్రక్రియను జొప్పించి ప్రతిపక్షాలను ఇరికించాలని చూసిన మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో గట్టి దెబ్బ తగిలిందని విమర్శించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి బీజేపీకి ఉంటే, దానిని విడిగా ప్రవేశపెట్టాల్సి ఉండేదని.. కానీ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం వారి కుట్రకు నిదర్శనమన్నారు. డిలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని తెలిసినా, 'బుల్డోజర్' రాజకీయం చేయాలని చూసిన కేంద్రం చివరకు విఫలమైందన్నారు. మహిళా బిల్లు వీగిపోవడానికి కేంద్ర ప్రభుత్వ మొండివైఖరే కారణమని, దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, ఈగ దామోదర్, నాయకులు గుంటీ కుమారస్వామి, లింగం రజిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రతపై పోలీసుల వినూత్న చర్యలు

### కొవ్వొత్తుల ర్యాలీతో మృతులకు నివాళి హెల్మెట్ల పంపిణీ





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 18 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజల ప్రాణరక్షణ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్అలైవ్" కార్యక్రమం ధర్మసాగర్ మండలంలో చురుకుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం పోలీసులు రెండు విభిన్న కార్యక్రమాలతో ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.మొదటగా రాంపూర్ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ధర్మసాగర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీధర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఖాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాహనదారులకు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ వినియోగం ప్రమాదాలకు కారణమవుతున్నాయని హెచ్చరించారు. అనంతరం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి దాతల సహకారంతో హెల్మెట్లు పంపిణీ చేశారు. ధర్మసాగర్ గ్రామంలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారిని స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీసులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతులకు ఘన నివాళులు అర్పించారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు.అనంతరం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను శాలువాలతో సత్కరించి, గులాబీ పూలతో గౌరవించి అవగాహన కల్పించారు. శిక్షలకంటే చైతన్యమే మార్పుకు దారి తీస్తుందనే భావనతో ఈ వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చిన్న నిర్లక్ష్యం ప్రాణనష్టానికి దారితీస్తుందని గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు. మండలంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

# భయం అంటే పిరికితనం కాదు.. అది బాధ్యతకు ప్రతిరూపం



లోకంలో భయం అనే పదాన్ని ప్రతికూల అర్థంలోనే ఎక్కువగా వాడుతుంటాం. భయం ఉన్నవాడు పిరికివాడని, ధైర్యం లేనివాడు వెనకబడిపోతాడని సమాజం ముద్ర వేస్తుంది. కానీ, నిశితంగా పరిశీలిస్తే మనిషిలోని ప్రతి భయం పిరికితనం వల్ల పుట్టింది కాదు. అనేక భయాల వెనుక అదృశ్యంగా బలమైన బాధ్యతలు ముడిపడి ఉంటాయి. ఆ భయం వ్యక్తిగత స్వార్థం కోసం కాదు, తనపై ఆధారపడిన వారి భవిష్యత్తు కోసం పుట్టే ఒక హెచ్చరిక.

### హద్దులు నిర్దేశించే అప్రమత్తత

సాధారణంగా ఒక సాహసం చేసేటప్పుడో, రిస్కు తీసుకునేటప్పుడో మనిషి వెనకడుగు వేస్తే దానిని పిరికితనం అంటారు. ఒక కుటుంబ యజమాని తప్పుడు మార్గంలో వెళ్ళడానికి భయపడుతున్నాడంటే, అది అతడి చేతకానితనం కాదు. తన నీడన బతుకుతున్న కుటుంబం రోడ్డున పడకూడదనే బాధ్యత. ఒక విద్యార్థి పరీక్ష తప్పితే ఏమవుతుందో అని భయపడుతున్నాడంటే, అది తన తల్లిదండ్రుల కష్టార్జితం వృధా కాకూడదనే స్పృహ. ఇక్కడ భయం ఒక విలువైతే, బాధ్యత ఒక గమ్యం.

### విలువల పరిరక్షణలో భయం

సమాజంలో తప్పు చేయడానికి భయపడే వ్యక్తి నిజమైన ధైర్యవంతుడు. ఎందుకంటే ఆ భయం అతడిని పతనం నుండి రక్షిస్తుంది.
క్రమశిక్షణ: చట్టానికి, ధర్మానికి భయపడటం వల్లనే సమాజంలో క్రమశిక్షణ వెల్లివిరుస్తుంది.
నైతికత: ఇతరులను దూషించడానికి లేదా అన్యాయం చేయడానికి భయపడటం వెనుక మానవీయ బాధ్యత ఉంటుంది.
మన కారణంగా మనకు ఇష్టమైన వారు బాధపడతారేమో అనే భయం. ప్రేమానురాగాలను బలపరుస్తుంది. బాధ్యతాయుతమైన భయమే ప్రగతికి మూలం
నిజానికి, భయం లేని సాహసం ప్రమాదకరం. వాహనం నడిపేటప్పుడు వేగం విషయంలో ఉండే భయం మన ప్రాణాలనే కాదు, ఎదుటివారి ప్రాణాలను కాపాడే బాధ్యతను గుర్తు చేస్తుంది. యుద్ధ రంగంలో సైనికుడికి ఉండే భయం అతడిని మరింత అప్రమత్తంగా ఉంచి, దేశ రక్షణ బాధ్యతను నెరవేర్చేలా చేస్తుంది.
భయాన్ని బలహీనతగా చూడటం మానేసి, దాని వెనుక ఉన్న ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలి. స్వార్థంతో కూడిన భయం పిరికితనం కావచ్చు కానీ, పదిమంది క్షేమం కోసం, బాధ్యతల నిర్వహణ కోసం మనసులో కలిగే అశాంతి కచ్చితంగా గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం. బాధ్యత తెలిసిన వాడు ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండలేడు. ఆ అజాగ్రత్త పట్ల ఉండే భయమే అతడిని ఒక పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. కాబట్టి, భయపడటం అంటే ఓడిపోవడం కాదు.. గెలవడానికి కావాల్సిన జాగ్రత్తను పాటించడం.



సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్

# భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాదఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు. ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

**పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక**



**హైదరాబాద్,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):**
ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

**నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం**

**మండిపడ్డ జనసేన నేత నాగబాబు**



**అమరావతిఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):**
ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరాది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు. రాముడిని ఎగతాళి చేసేవారు తమని తాము నష్టపర్చుకుంటున్నారని, అజేయమైన ధర్మాన్ని కాపాడే శక్తులు నిరంతరం పని చేస్తుంటాయని నాగబాబు అభిప్రాయ పడ్డారు. చరిత్రలో న్యాయానికి వ్యతిరేకంగా నిలిచినవారు పతనమయ్యారని, అదే విధంగా రాముడిపై విషం చిమ్మే వారి భవిషత్తు కూడా అదే అవుతుందని నాగబాబు అన్నారు. 'రాముడి పేరే ఓ కవచమని, ఆయన కథ ఖడ్గమని, ఆయన ఉనికి నాగరికతకు అచంచలమైన కోట' అని నాగబాబు ఆ పోస్ట్‌లో పేర్కొంటూ, ఇన్ డైరెక్ట్‌గా ప్రకాశ్ రాజుకు స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి నాగబాబు మరో ట్వీట్‌ను పోస్ట్ చేశారు. 'ప్రకాశ్ రాజ్‌గారూ మీరు... నాస్తికుడినని చెప్పారు. అయితే మీ తల్లి అంత్యక్రియలను ఆవిడ విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకుని క్రైస్తవ పద్ధతిలో మీరు నిర్వహించారు. అది కొడుకుగా మీ బాధ్యత అని మేం గౌరవించాం. అదే భావనతో మీరు కోట్లాదిమంది నమ్మకాన్ని గౌరవించాలి. నాస్తికత్వం అంటే దేవుళ్లను లేదా విశ్వాసాలను ఎగతాళి చేయడం కాదు. అది ఒక తార్కిక ఆలోచనా విధానం. హిందూమతం మాత్రమే నాస్తికత్వాన్ని కూడా ఓ తాత్విక ఆలోచనగా అంగీకరిస్తుంది. అలాంటి సంప్రదాయాన్ని నిర్లక్ష్యం చేయడం తార్కికత కాదు... అగౌరవపర్చడం. ఇతర దేశాల్లో అయితే ఇలాంటి మాటలు చెప్పినందుకు మీరు తీవ్రమైన ఇబ్బందులకు లోనయ్యేవారు. నేను మీ గురించి చేస్తున్న చివరి వ్యాఖ్య ఇదే. ఇక మీదట మీదో వాదించను' అని నాగబాబు తెలిపారు. మరి దీనిపై ప్రకాశ్ రాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.


# కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

**ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు**

**పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు**

**ఐదు డిఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి**

**ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్**



**హైదరాబాద్,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# నేడు వర్ధన్నపేటలో హిందూ ధర్మ సమ్మేళనం

**ముఖ్య అతిథులుగా శ్రీకాంత్ శర్మ, కరుణాసాగర్, విజయభారతి**

**వర్ధన్నపేట/ఏప్రిల్ 18(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట ఉప మండల కేంద్రంలో ఆదివారం హిందూ ధర్మ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక భారతీయ నాటక కళాశాల ప్రాంగణంలో జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి హోమంతో ప్రారంభం కానుంది. లోక కల్యాణార్థం నిర్వహించే ఈ హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ సమ్మేళనానికి ముఖ్య వక్తలుగా హిందూ ధర్మ చక్రం వ్యవస్థాపకులు మద్దికుంట శ్రీకాంత్ శర్మ, హైకోర్టు సీనియర్ న్యాయవాది కాశీం చిట్టి కరుణాసాగర్, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి హాజరై ధర్మ ప్రబోధం చేయనున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను చాటిచెప్పేలా ఈ సదస్సు సాగనుంది. వర్ధన్నపేట నియోజకవర్గంలోని భక్తులు, ధర్మ బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చి, హోమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్ధన్నపేట హిందూ ధర్మ సమ్మేళన కమిటీ ప్రతినిధులు కోరారు.

# మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్: బీజేపీ ఆరోపణ



**భీమదేవరపల్లి/ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ మరియు ఇండియా అలయెన్స్ పార్టీలపై బీజేపీ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా మహిళలు ఎదురుచూస్తున్న బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరమని అన్నారు. పార్లమెంట్ వేదికగా మహిళలకు అన్యాయం జరిగిందని, ఇది దేశ చరిత్రలో "బ్లాక్ డే"గా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళలకు చట్టసభల్లో సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. అయితే కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా మహిళల ఆశలను దెబ్బతీశాయని విమర్శించారు. మహిళలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీతో పాటు దాని మిత్రపక్షాలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సామాన్య మహిళలకు రాజకీయ అవకాశాలు లేకుండా కుటుంబ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. మహిళల సాధికారతకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిని ప్రజలు తగిన విధంగా ప్రశ్నించాలని శ్రీనివాస్ సూచించారు.

# పూలతో సందేశం- హెల్మెట్‌తో రక్షణ

**: వంగర పోలీసుల ప్రత్యేక కార్యక్రమం**



**భీమదేవరపల్లి/ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళపల్లి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు వంగర పోలీసులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి, పూలు, స్వీట్లు అందిస్తూ హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమాన్ని వంగర ఎస్ఐ దివ్య నేతృత్వంలో చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి పూలు అందజేసి, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దివ్య మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల కోసం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. "హెల్మెట్ ధరించి నిజమైన హీరోలుగా నిలవాలి, హెల్మెట్ లేకుండా జీరోలు కావద్దు" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజయ్య, కానిస్టేబుళ్లు రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

**బిజెపి ఎంపి లక్ష్మణ్ హెచ్చరిక**



**న్యూఢిల్లీ,ఏప్రిల్18 (జర్నలిస్ట్ వార్త):** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. ' మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.